ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 19 సంచిక : 07 మార్చి 2014

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

సద్గురు శ్రీ నాన్నగారి
అనుగ్రహభాషణములు
1995

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 1995)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. దాని విలువ మనకు తెలియకపోవటం వలన దాని గురించి మనం ప్రయత్నం చేయటంలేదు. అది తప్ప ఈ లోకంలో ఏది సాధించినా అవి అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. నీకు ఉన్న తెలివితేటలతో సత్యవస్తువును తెలుసుకోకపోతే నీ తెలివిని ఏమి చేసుకొంటావు? కొంతమందికి తెలివి ఉంటుంది. వాళ్ళ తెలివి వలన వారే పాడైపోతారు. దీనికి వినయం లేకపోవటం కారణం. మీకు డబ్బు ఉన్నా, తెలివి వున్నా వినయం కనుక లేకపోతే ఆ డబ్బే, తెలివే మిమ్మల్ని పాడుచేస్తాయి. మీకు ఏదో కారణం వలన దుఃఖం వస్తోంది అనుకోండి, దానిని మీరు కంట్రోలు చేసుకోలేకపోతున్నారు అనుకోండి, మహాత్ముల దగ్గరకు వెళ్ళి కూర్చొంటే నిప్పుమీద నీరు పోస్తే అది ఎలా చల్లారిపోతుందో అలాగ మహాత్ముల సన్నిధిలో నీ దుఃఖం అంతా చల్లారిపోతుంది.

ఒకరిని ఒకరు విమర్శించుకొంటూ ఉంటారు. ఎదుటి వారు విమర్శించటం వలన నీకు దుఃఖం వస్తోంది అనుకొంటావు. వారు విమర్శించటం వలన నీకు దుఃఖం రావటంలేదు. విమర్శకు నీ మనస్సులో చోటు ఇవ్వటం వలన దుఃఖం వస్తోంది అని భగవాన్ చెప్పారు. విమర్శకు నీ మనస్సులో చోటు ఇవ్వకపోతే ఎదుటివారు ఎంత విమర్శించినా దుఃఖంరాదు. దుఃఖకారణం నీ మనస్సులో

ఉంది, బయట లేదు. ప్రారబ్ధాన్ని బట్టి మీకు ఏదైనా కష్టం వస్తూఉంటే దానికి ఫలానా వారు కారణం అని అనుకోవద్దు. ప్రారబ్ధంలో ఉన్నప్పుడు వారు కాకపోతే ఇంకొకరు సిద్ధమవుతారు. ప్రారబ్ధంలో ఉంటే దానిని ఇష్టంగా అనుభవించటం వలన అది పోతుంది, అయిష్టంగా ఉంటే వచ్చే జన్మలో మరల అదే మనకు ఎదురవుతుంది. మనం శాంతిని, ఆనందాన్ని కోరుకొంటాము. మనకు లేని వస్తువులో ఆనందం ఉందని అనుకొంటాము. కష్టపడి దానిని సంపాదిస్తాము. అది అందిన తరువాత అక్కడ ఆనందం లేదని మనకు తెలుస్తుంది. ఇందులో లేదు ఇంకోచోట ఉందని వెదుకుతాము. అది వచ్చిన తరువాత అందులో కూడా ఆనందం లేదని తెలుస్తుంది. ప్రతిజన్మలోను ఇలా ప్రయత్నంచేయటం, భంగపడటం మరల వెనుకకు తిరగటం, మనకు ఇదేపని. బాహ్యలోకంలో శాంతి, ఆనందం లేవు. ఆనందం, శాంతి నీ హృదయంలోనే ఉన్నాయి. ఏ వస్తువును తెలుసుకొంటే మనకు ఆనందం, శాంతి అందుతాయి అని నీ వివేకమును, నీ విచారణను ఇక్కడ ఉపయోగించాలి.

సుఖంకోసం, శాంతికోసం మనస్సు ఇప్పుడు బయట తిరుగుతోంది. సుఖం, శాంతి బయటలోకంలో ఎక్కడా లేవు, అవి లోపలే ఉన్నాయి అని దానికి నచ్చజెప్పి, మనస్సును నెమ్మదిగా, జాగ్రత్తగా వెనుకకు త్రిప్పాలి, మనస్సుకు లోచూపు నేర్పాలి. మనస్సు హృదయంలో పుడుతుంది, శిరస్సులో విజృంభిస్తుంది. మనస్సును శిరస్సులోనికి రాకుండా సాధ్యమైనంత వరకు హృదయంలో ఉంచగలిగితే దాని విజృంభణ నెమ్మదిగా తగ్గిపోతుంది. మనస్సు దాని విజృంభణ ఆగిపోయి సహజంగా హృదయంలో ఉండటం వలన అది కరిగిపోతుంది. దుఃఖం వచ్చినప్పడు, ఆ దుఃఖ నివారణ కోసం ఆశ్రమాలకు వెళతారు, పెద్దల దగ్గరకు వెళతారు. అంతేగాని ఈ దుఃఖానికి కారణం ఏమిటి అని ఆలోచించుకొనేవారు చాలా తక్కువ మంది ఉంటారు. మనకు స్వతంత్రమైన ఆలోచన ముఖ్యం. సమాజంలో అనుకరణ ఎక్కువ. ఆశ్రమాలకు, పెద్దల దగ్గరకు వెళ్ళవద్దని చెప్పటంలేదు. మీకు దుఃఖం వస్తూఉంటే ఏ కారణం వలన అది వస్తోంది అని నిలబడి ఆలోచించుకోండి.

ఎవరికైనా సహాయం చేసినప్పడు వారికి చేసాము, వీరికి చేసాము అని అనుకోవద్దు. దేవుడే ఆ ఉపాధి ధరించాడు అనుకోండి. దేవునికి తెలియకుండా ఉపాధి రాదు. కనిపించే ఉపాధులు అన్నీ దేవుని ఉపాధులే అనుకొంటే మనకు పొగరుబోతుతనం తగ్గుతుంది. ఎవరైనా మిమ్ములను విమర్శిస్తే దేవుడే చేయిస్తున్నాడు అనుకోండి. మీలోని బలహీనతలు తీసివేయటానికి

ఇలా చేయిస్తున్నాడు అనుకోండి. అన్ని ఉపాధులు పరమేశ్వరుడివే అనే భావన కలిగితే వేరుబుద్ధి నశిస్తుంది. సత్యాన్వేషకుడు బహుజాగ్రత్తగా ఉండాలి. ఇప్పుడు దేహము నీకు ఎలా అనుభవంలో ఉందో అలాగ చైతన్యం నీకు అనుభవంలోనికి వచ్చేవరకు బంధం నిన్ను విడిచిపెట్టదు, పునర్జన్మలు విడిచి పెట్టవు, అప్పటి వరకు శవాలను మోయటం తప్పదు. అలా ఉంటే దుఃఖం ఉండదు, ఇలా ఉంటే దుఃఖం ఉండదు అని కొంతమంది అంటూఉంటారు. అలా తయారయ్యాక అందులోకూడా ఏమీలేదని నీకు తెలుస్తుంది. సాధన చెయ్యటం ఎందుకు అంటే అందులో కూడా ఏమీ లేదు అని తెలియటానికే సాధన చెయ్యమని చెప్పారు.

పని పనికోసమే చెయ్యండి. పని నిర్మలంగా చెయ్యండి. ఇతరులకు తెలియాలి అని అనుకోవద్దు. పనిని ఇష్టంతో చెయ్యండి. చేసే పని చిన్నది అయినా ఇష్టంతో, ప్రేమతో చేసినప్పుడు దేవుడు సంతోషిస్తాడు. ఎవడి అహంకారానికి ఇష్టమైన పనిని వాడు చేయటం కాదు, నాకు ఇష్టమైన పనిని చేయండి అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీకు నిద్రవస్తూ ఉంటే మీకు ఇష్టమైన వారు మాట్లాడుతూ ఉన్నా తరువాత మాట్లాడుకొందాం అంటారు. చేతిలో బంగారం ఉన్నా దానిని ప్రక్కన పెట్టి నిద్రపోతారు. ఎందుచేతనంటే నిద్రలో సుఖం ఉంది, శాంతి ఉంది, ఆనందం ఉంది. బాహ్యంగా మిత్రులుగాని, బంధువులుగాని ఇవ్వలేని ఆనందం నిద్రలోమనం పొందుతున్నాము. నిద్రలో మనస్సు హృదయంలోనికి పోతుంది, మీకు తెలియకుండానే మనస్సు తన సొంతఇంటికి వెళ్ళిపోతుంది. మెలుకువలో మీకు తెలిసి ఉండగా మనస్సును దాని సొంత ఇంటికి పంపాలి, అప్పుడు మీకు స్వస్థత కలుగుతుంది. ఇలా పంపే ప్రయత్నంలో మనకు తెలివితేటలు అవసరమేగాని తెలివితేటలు ఒక్కటే సరిపోవు. గురువు అనుగ్రహం అవసరం. ఈ ప్రయత్నంలో గురువు అనుగ్రహం ప్రధానమైనది, మనం చేసే సాధనలు అన్నీ రెండవ పక్షం.

భగవంతుడిని తెలుసుకోవాలని ఉంది నన్ను ఏ దారిని వెళ్ళమంటారు అని ఒకరు భగవాన్‌ను అడిగితే వచ్చిన దారినే వెళ్ళు అని భగవాన్ చెప్పారు. ఇప్పుడు మనం మీటింగుకు వచ్చాము. ఇక్కడ నుండి వచ్చినదారినే వెనుకకు వెళితే ఇంటికి వెళ్ళిపోతాము. అలానే మనస్సును వచ్చిన దారినే వెనుకకు పంపితే అది హృదయంలోనికి వెళ్ళిపోతుంది. మనస్సు హృదయంలోనికి వెళ్ళి అక్కడ స్థిరంగా ఉంటే మనస్సు నశిస్తుంది, అక్కడ ఉన్న పరమేశ్వరుడు మనకు వ్యక్తమవుతాడు. కష్టకారణం ఉన్నా కష్టం లేకుండా ఉండగలిగితే, దుఃఖకారణం

ఉన్నా దుఃఖంలేకుండా ఉండగలిగితే అప్పుడు దైవసహాయం నీకు అందుతుంది. ఆత్మానందం ఎలా ఉంటుంది అని ఊహించవద్దు, దానిని పొందటానికి ప్రయత్నం చేయండి. నాలుగు బూరెలు దగ్గర పెట్టుకొని తింటూఉంటే మొదటి బూరె తిన్నప్పుడు ఉన్నంత ఆనందం రెండవ బూరె తిన్నప్పుడు ఉండదు. అలాగ నాలుగవ బూరె దగ్గరకు వచ్చేటప్పటికి వద్దు అనిపిస్తుంది, వెగటగా ఉంటుంది. కాని ఆత్మానందం అటువంటిది కాదు, అది నిత్యనూతనం, ఎప్పటికప్పడు ఫ్రెష్‌గా ఉంటుంది, అది అభౌతికం, అది అలౌకికం. సూర్యుడు చీకటినిచూడాలి అనుకొన్నాడు అనుకోండి, ఆయన చూడలేడు. ఎందుచేతనంటే ఆయన ఎక్కడికి వెళితే అక్కడకు వెలుతురు వచ్చేస్తుంది. అలాగే బ్రహ్మానుభవం పొందినవాడు ఎక్కడికి వెళ్ళినా సుఖం, శాంతి, ఆనందం తప్ప వాడికి దుఃఖం లేదు. నెలలు ఉన్న పిల్లవాడిని తల్లి ఎంత జాగ్రత్తగా చూస్తుందో, జ్ఞానసముపార్జనలో మనం అంత శ్రద్ధగా ఉండాలి. తల్లి ఏ పని చేస్తున్నప్పటికీ ధ్యాస అంతా పిల్లవాడిమీదే ఉంటుంది. అలాగే మనం ఏ పని చేస్తున్నప్పటికి మన ధ్యాస అంతా జ్ఞానం మీద ఉండాలి. అంత శ్రద్ధగా ఉంటే అదే మనకు జ్ఞానాన్ని సంపాదించిపెడుతుంది. శ్రద్ధ లేకపోతే చైతన్యస్థాయి పెరుగదు.

మనస్సులో ఉన్న చీకటి ఏదో రకంగా బయటకు వచ్చేస్తూ ఉంటుంది. ఇతరులు మిమ్మల్ని తిట్టినప్పడు తిరిగి మీరు కూడా తిట్టేయండి అని ఈ మధ్య ఒకరితో చెప్పాను. ఆయన ఏమన్నారు అంటే ఎదుటి ఇంటిలో కరెంటు లేదు అనుకోండి, వారు చీకటిలో ఉన్నారు అనుకోండి, మనం కూడా చీకటిలో ఉందాము, మనకు కూడా కరెంటు వద్దు అనుకొంటామా? అని అడిగారు. అలా అనుకోము అని చెప్పాను. వాడి బుర్రలో ఉన్న చీకటిని బట్టి అలా మాట్లాడుతున్నాడు. ఆ చీకటి మనకు కూడా ఉండాలి అని ఎందుకు అనుకోవాలి. వాడి బుర్రలో ఉన్న చీకటిని ఆహ్వానించటం ఎందుకు? మంచికి ఆహ్వానం గాని చెడ్డకి ఆహ్వానం దేనికి అని చెప్పారు. ఏదైతే శాశ్వతము కాదో దానిని సంపాదించినా అది స్వప్న సమానము. ఏదైతే శాశ్వతమో దానిని పొందటానికి ప్రయత్నించు. అది అందినప్పడు బయట వస్తువుల మీద ఆధారపడకుండా స్వతంత్రమైన ఆనందమును నీవు అనుభవించవచ్చును. ఈ దేహంపోతే పోనియ్యండి. జ్ఞానమును ఎంతవరకు సంపాదించాము అనేది చూసుకోండి. మనం నాలుగు సంవత్సరాలు ఎక్కువ బతకవచ్చు, తక్కువ బతకవచ్చు. ఈ జన్మ అనేది ఒక కామా. వాక్యం వ్రాసేటప్పడు మధ్య మధ్య కామాలు పెడతాము. కామా పెట్టినప్పడు వాక్యం

పూర్తికాదు, ఫుల్‌స్టాప్ పెట్టినప్పడు వాక్యం పూర్తయినట్లు లెక్క. మన జన్మలు అన్నీ కామాలు. జ్ఞానం వచ్చినప్పడు మాత్రమే ఈ జీవుడికి ఫుల్‌స్టాప్. చైతన్యం అనుభవంలోనికి వచ్చేవరకూ ఫుల్‌స్టాప్ లేదు. అంతవరకు జన్మజన్మలకు కామాలు పెట్టుకొంటూ పోవలసిందే. దేహానికి ముగింపు ఉంది కాని జీవితానికి ముగింపులేదు. చైతన్యం అనుభవంలోనికి వచ్చేవరకు ఈ జీవితానికి ముగింపులేదు, అంతవరకు జన్మలు తప్పవు.

చైతన్యానుభవం పొందటానికి మనం చేసే ప్రయత్నంలో తొందరపడకూడదు. జాగ్రత్తగా నెమ్మదిగా ప్రయాణించాలి. ఇతరులు మన గురించి ఏమనుకొంటున్నారు అనే గొడవవద్దు. మన ప్రయాణం ఎలా ఉంది, మన మనస్సు ఎలా ఉంది అనేది చూసుకోవాలి. మనం చేసే పని ఎలా ఉంది అనేది కూడా చూసుకోవాలి. మనం చేసేపనికి అందరూ సంతోషించాలి అని అనుకోవద్దు. మనం ఏదైనా మంచిపనిచేసినా దానికి అందరూ సంతోషించరు. సహృదయం ఉన్నవారు మాత్రమే సంతోషిస్తారు. మనం చేసేపనికి అందరూ సంతోషించాలి అని అనుకొంటే అది ఒక పిచ్చితనం. సమాజం గొడవ మనకు అనవసరం. మనం చేసే పనుల వలన భగవంతుడు సంతోషించాలి. ఈశ్వరప్రీతికోసం పనులు చేస్తూ ఉంటే మనస్సు అణిగిపోతుంది. మనం అహంకారమును ఒక ప్రక్కనపెట్టి భగవంతునికి ఇష్టమైన పనులు చేస్తే మన మనస్సును ఆయనే ఉపసంహరించుకొంటాడు, అంటే మనస్సును ఆయనవైపుకు తిప్పకొని ఆయనలో లయం చేసుకొంటాడు. గురువు అనుగ్రహం దానంతట అదే వస్తుంది. గురువు అనుగ్రహం ఎప్పడు వస్తుంది, ఎలా వస్తుంది అని ఎదురుచూడవద్దు, దానికోసం వేగిరపడవద్దు. నీచేతిలో ఉన్న పనిని నిర్మలంగా చెయ్యి, నిరాడంబరంగా చెయ్యి, భగవంతుని ప్రీతికోసం చెయ్యి, ఎప్పడు అనుగ్రహించాలి, ఎలా అనుగ్రహించాలి, ఎక్కడ అనుగ్రహించాలి అనే ముహూర్తం ఈశ్వరుడు పెట్టుకుంటాడు. ఆ గొడవ నీకువద్దు. భగవంతుడు నీకు కేటాయించిన పనిని నిర్మలంగా చెయ్యి, శ్రద్ధగా చెయ్యి. పైకి మనం అందరిలాగే ఉండాలి. మనలో ఏదో ప్రత్యేకత ఉన్నట్లు కనబడకూడదు. లోపలనుండి శక్తిని పెంచుకుంటూ రావాలి. భక్తిపేరుమీదగాని, అధికారం పేరుమీదగాని మనం సామాన్య మానవునికి దూరమైతే మనం ఏదో పిచ్చితనంలో ఉన్నట్లు గుర్తు. బ్రెయిన్‌లో అటువంటి హెచ్చుతగ్గులు ఉండకూడదు.

దైనందినజీవితం వేరు, ఆధ్యాత్మికజీవితం వేరు అని మనం అనుకొంటున్నాము. మనం పూజ చేస్తాము. అది ఆధ్యాత్మికజీవితం అనుకొంటున్నాము. దైనందినజీవితంలో

మనం చేసే పనులు కూడా పూజ కింద చేయాలి. ప్రాపంచిక పనులు కూడా పూజకింద చేయాలి. గుడిలో దేవుని హుండీలో డబ్బువేసి అది పూజ అనుకొంటాము. బయట మనుషులకు డబ్బు ఇచ్చి దానం చేసాము అంటాము. ఇలా అనుకోవటం వలన అహంకారం పెరుగుతుంది. బయట మనుషులకు ఇచ్చిన డబ్బును కూడా పూజకింద చేయాలి. దైనందిన జీవితం వేరు, ఆధ్యాత్మిక జీవితం వేరు అనుకోవటం వలన మనం భగవంతునికి దూరమైపోతున్నాము. పూజ గదిలో దేవుడిని ఎలా ఆరాధిస్తున్నామో అలాగ సమాజమును కూడా ఆరాధించటం వలన నీ మనస్సు అణిగిపోతుంది. సమాజమును అంత గౌరవముగా చూస్తే ఈశ్వరుడు నీ మనస్సును ఉపసంహరింపచేస్తాడు అంటే ఆయన ఉన్న చోటుకు జీవుడిని పిలుచుకొంటాడు. నువ్వు చేసే సాధన నిజమైతే కుటుంబసభ్యులతో ఉన్న సంబంధం, సమాజంతో ఉన్న అనుబంధం మారిపోతూ ఉంటాయి. వారితో నువ్వు ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉంటావు. లోపలనుండి మార్పు వస్తూ ఉంటుంది.

నీకు దుఃఖం వచ్చినప్పడు, చిరాకు వచ్చినప్పడు ఇది ఎవరికి వచ్చింది అని ప్రశ్నించుకోవాలి. ఇది నేనుకు వస్తోంది. అయితే ఈ నేను ఎవరు అని ప్రశ్నించు. అది వచ్చాక అన్నీ వస్తున్నాయి కాబట్టి దానిని వెంబడించు, దానిని వెంటాడు. దానిని గౌరవించవద్దు, దానిని అలంకరించవద్దు, అప్పడు గతిలేక అది వెనుకకు తిరిగి దానిమూలంలోనికి వెళుతుంది. దాని పుట్టుస్థానమును చూసిన వెంటనే అది నశిస్తుంది. మనస్సు అణిగి ఉండటంవేరు, నాశనం అవ్వటం వేరు. అణిగిన మనస్సు ఎప్పడైనా తిరిగి విజృంభిస్తుంది. అణిగిన మనస్సు వలన ఎప్పడైనా ప్రమాదమే. మనస్సు అణిగి ఉన్నప్పడు జ్ఞానానికి జానెడు దూరంలో ఉన్నాము అని మనకు అనిపిస్తుంది. అందుచేత మనోనాశనం ముఖ్యం. ఎక్కడికి వెళ్ళాలి, ఎక్కడికి వెళ్ళకూడదు, ఏది చదవాలి, ఏది చదవకూడదు, ఎవరితో సహవాసం చెయ్యాలి, ఎవరితో సహవాసం చెయ్యకూడదు అనే వివేకం మనకు ఉండాలి. వస్తువును పొందుతామా లేదా అనే అనుమానం వద్దు. మనం శ్రద్ధగా సాధన చేస్తే, మన సాధనలో సిన్సియారిటీ ఉంటే భగవదనుగ్రహం వలన మన హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు అనుభవంలోనికి వస్తుంది. కొంతమంది కృత్రిమగౌరవాలకోసం జీవితాన్ని పాడుచేసుకొంటారు, లోపల విషయాన్ని చూసుకోరు. ఇటువంటివారికి నిప్పలో పెట్టిన పుల్లల గతి పడుతుంది. ఈ గౌరవాలు ఎంతవరకు నిలబడతాయి. ఇతరులు గౌరవిస్తే ఏమిటి? గౌరవించకపోతే

ఏమిటి? ఇవి అన్నీ దేహానికి సంబంధించినవి. అందరికీ చనిపోయిన తరువాత కైలాసానికి వెళదాము, వైకుంఠానికి వెళదాము అనే గొడవే. వెళితే వెళ్ళవచ్చును గాని ముందు ఇలా వెళ్ళాలనే ఈ నేను ఎవడో చూడు. మరణించిన తరువాత ఎవడైతే కైలాసమునకు వెళ్ళాలి అని అనుకొంటున్నాడో వాడినుండి విడుదలపొందటమే మోక్షం అని చెప్పారు.

గుడిలో దేవుడు ఉన్నాడు అంటే నమ్ముతాము కాని మన హృదయంలో దేవుడు ఉన్నాడు అంటే నమ్మము, ఇది అంతా కల్పించేది మనస్సు. గుడిలో దేవుని దగ్గరకు వెళితే మనస్సుకు నష్టంలేదు, హృదయంలో ఉన్న దేవుని దగ్గరకు వెళితే ఇంక అది ఉండదు అందువలన అక్కడికి వెళ్ళటానికి మనస్సు ఇష్టపడదు. చాలామందికి దేవుడిని వేరుగా చూడటం ఇష్టం. వేరుగా ఉంటే కోరికలు అడగవచ్చును, మనకు ఆయన మీద ప్రీతి కలగటంకోసం దేవుడు ఒకోసారి కోరికలు నెరవేరుస్తాడు. ప్రీతి కలిగాక లోపలకు గెంటివేస్తాడు. జ్ఞాని మాటలను శ్రవణం చేయటంవలన, వాటిని మననం చేయటం వలన సత్యమును తెలుసుకోవాలనే కాంక్ష కలుగుతుంది. సబ్జక్టు మీద చెప్పేవాడికి ముందు ప్రేమ ఉండాలి. చెప్పేవాడికి ప్రేమ ఉంటే వాడి హృదయం నాలుక మీద ఉంటుంది. అప్పడు వాడు ఏమి చెప్పినా అది హృదయాంతరాళములలో నుండి వస్తుంది. పిల్లల మీద తల్లికి ఎంత ప్రేమ ఉంటుందో చెప్పేవాడికి వినేవాడిమీద అంత ప్రేమ ఉండాలి. భగవాన్ ఎక్కువగా మౌనంగా ఉండేవారు. అప్పడప్పడు మాటలు చెప్పేవారు. అయినా అందుకోలేనప్పడు ఏమి చేస్తాము వాసన అంత బలీయంగా ఉన్నది అనేవారు. ఏ వాసన వలన సబ్జక్టును అర్థం చేసుకోలేకపోతున్నారో ఆ వాసన పల్చబడేటట్లు, బలహీనపడేటట్లు చేసేవారు. వాసనకు ఏనుగుకు ఉన్నంత బలం ఉంటుంది. వాసన అనే ఏనుగు గురువు అనుగ్రహం అనే సింహానికి లొంగుతుంది. గురువు అనుగ్రహం కలిగినప్పడు మాత్రమే నీవు వాసనలనుండి బయటపడగలవు.

కొంతమంది కళ్ళతో చూస్తేగాని ఏదీ నమ్మరు. చూడాలంటే రూపం ఉండాలి కదా. చైతన్యానికి రూపంలేదు. అందువలన అది కళ్ళకు కనబడటంలేదు. అది కనబడటంలేదు కాబట్టి చైతన్యమే లేదు అనుకొంటున్నాము. ఇదే మాయ. జేబులో పెన్ను పెట్టుకొని దానికోసం ఇల్లంతా వెతకటం ఎలా ఉందో, చంకలో పిల్లవాడిని పెట్టుకొని వాడికోసం ఊరంతా వెతకటం ఎలా ఉందో, మన హృదయంలో చైతన్యాన్ని పెట్టుకొని దానికోసం బయట గుడులలో, గోపురాలలో దేశం అంతా తిరిగి వెతకటం అలా ఉంది. మనస్సుకు లోకవాసన పెరిగిపోయి,

బాహ్య ప్రవృత్తి పెరిగిపోయి దేవుడు ఎక్కడో బయట ఉన్నాడు అని వెతుక్కొంటున్నాము. ఒకో మనిషికి ఒకో రకమైన కోరికలు ఉంటాయి. ఆ కోరికలు నెరవేరటానికి భగవంతుని ప్రార్థిస్తాము. ఆ కోరికలు నెరవేరటానికి తగిన జన్మను ఇస్తాడు. ఆ కోరికలు నెరవేరిన వెంటనే మరల కొత్తకోరికలు పుడతాయి. వాటిగురించి దేవుని ప్రార్థిస్తాము. అవి నెరవేరటానికి తగిన జన్మలు ఇస్తాడు. ఇలా కొన్ని వేల జన్మలు ఈ ప్రవాహంలో కొట్టుకొనిపోతాము. ఇదే మాయ. విషయమును అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. నమస్కారములు పెట్టటం, దండలు వేయటంకాదు. ఇటువంటివాటితో కాలమును పాడుచేసుకోవద్దు. కాలమును పాడుచేసుకొంటే మరలరాదు. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి. నియమములన్నింటిలోకి ఆహారనియమం ఉత్తమమైనది అన్నారు భగవాన్. ఆహారనియమం లేకుండా సాధన చేసినా అభివృద్ధి కనబడదు.

కోరికలు నెరవేరితే ఆనందం వస్తుంది అని కోరికలు కోరుకొంటాము. ఆ కోరికలు నెరవేరిన తరువాత మనం కోరుకున్న ఆనందం ఇందులో లేదు అని తెలుస్తుంది. వేరే కోరికలు నెరవేరితే ఆనందం పొందవచ్చు అని అప్పుడు మనకు అనిపిస్తుంది. అవి కూడా నెరవేరిన తరువాత అందులో కూడా ఆనందం లేదు అని తెలుస్తుంది. ఏ జన్మకు ఆ జన్మ మనకు అలా అనిపిస్తూ ఉంటుంది. కోరికలు నెరవేరటం వలన ఆనందం రాదు. అసలు ఆనందం అనేది బయట లేదు, అది నీ హృదయంలోనే ఉంది అని ఏ మహాగురువో బోధించటం వలన మనకు తెలియాలి కాని లేనిచో ఏ జన్మకు ఆ జన్మ ఇలా కొట్టుకొని పోతాము. సుఖం, శాంతి బయటలేవు, అవి నీ హృదయంలోనే ఉన్నాయి అని గురువు సహాయం వలన నీకు అర్థమయ్యాక బాహ్యముఖంగా తిరుగుచున్న మనస్సు అప్పుడు అంతర్ముఖమవుతుంది. నీ దేహయాత్రకు సరిపడ పనిచేసుకొంటూ, మిగిలిన కాలం అంతా ఆత్మాన్వేషణలో ఉంటే నీకు ఆత్మానుభవం కలుగుతుంది కాని నిరంతరం ప్రాపంచిక గొడవలలో ఉన్నవాడికి ఆత్మవస్తువు దొరకదు.

మనస్సు చైతన్యమును పట్టుకోలేదు. మనస్సు చాలా చిన్నది. ఇది బుడగలాంటిది. చైతన్యం సముద్రం వంటిది. బాహ్యగొడవలను తగ్గించుకొని, మనస్సుకు లోచూపు నేర్పి, మనస్సును తీసుకొనివెళ్ళి హృదయంలో స్థిరంగా ఉంచితే అప్పుడు మనస్సు కరిగిపోతుంది, అప్పుడు అక్కడ ఉన్న చైతన్యమే నీకు నేనుగా వ్యక్తమవుతుంది. అదే కడసారి జన్మ. భోగంలో

సుఖం ఉంది, నువ్వు భోగసామాగ్రిని సంపాదించుకో అని అబద్ధమైననేను చెపుతుంది. ఒక్క ఆత్మలోనే సుఖం ఉంది అని భగవాన్ చెప్పారు అంటే భోగంలో సుఖం లేదు అని అర్థం. ఇక్కడ జ్ఞాని చెప్పినమాటలు నమ్మటమా, అబద్ధమైన నేను చెప్పిన మాటలు నమ్మటమా అనేది మనం నిర్ణయించుకోవాలి. ఇక్కడ నీ వివేకాన్ని ఉపయోగించాలి. భోగించటం వలన ఏదైనా కొంచెం సుఖం పొందినట్లు నీకు అనిపించినా అది పరిణామంలో అనంతమైన దుఃఖమును తీసుకొనివస్తుంది. నువ్వు అహంకారమును ప్రమాణంగా తీసుకోవద్దు, శాస్త్రమును ప్రమాణంగా పెట్టుకో. గుణాల కలయికే జీవుడు. గుణాలు చెప్పినట్లు గంతులు వేయవద్దు. భగవంతుడు చెప్పినట్లు నడుచుకుంటే బాగుపడతావు. జ్ఞానం వస్తుందా రాదా అనే సంశయం వద్దు. జ్ఞానం తప్పకవస్తుంది. జ్ఞానం వచ్చేయోగం లేకపోతే శ్రవణం చేయాలనే బుద్ధి కలుగదు. పూర్వజన్మలో చేసిన పుణ్యకర్మఫలంగా శ్రవణం చేయాలనే బుద్ధి కలిగింది. ఏ శక్తి అయితే మీచేత శ్రవణం చేయిస్తోందో అదే శక్తి మీకు మోక్షం వచ్చేవరకూ వదలదు. అందుచేత సందేహాలు వద్దు.

కుటుంబంలో నీవు చేసే పని కర్తృత్వం లేకుండా చెయ్యి, డ్యూటీ చేస్తున్నట్లుగా ఉండాలి. బాగుపడేవాడు బాగుపడతాడు, చెడిపోయేవాడు చెడిపోతాడు. అది నీ బాధ్యత కాదు. నేనే కర్తను అనుకోవద్దు. సృష్టికి కర్త ఈశ్వరుడు. అంతా ఆయనే చూసుకుంటాడు. ఆ కుటుంబంలో జన్మించావు కాబట్టి వారిపట్ల నీ డ్యూటీ ఏదో నువ్వు చెయ్యి. కర్తృత్వం పెట్టుకొంటే బతికి ఉండగా దుఃఖం, చనిపోయిన తరువాత చీకటి లోకాలు వస్తాయి. కర్తృత్వ బుద్ధి వలననే మనిషికి దుఃఖం వస్తోంది. కర్తృత్వబుద్ధి నశిస్తే మీ పని మీరు చేసుకొని వెళ్ళిపోతారు. మీకు కుటుంబం కనబడదు, లోకం కనబడదు, దేహం కనబడదు, విషయాలు కనబడవు. విషయాలు కనబడితే కదా ఆకర్షణ, విషయాలు కనబడనప్పుడు ఆకర్షణ ఏమి కలుగుతుంది. నీకు తలంపులు వస్తున్నాయి కదా. నీకు వచ్చే తలంపులు నీవా? లేక కుటుంబం లోనివారివా? అంటున్నారు భగవాన్. ఆ తలంపులు నీవే కాబట్టి వాటిని పెంచుకోవటమా లేక తుంచివేయటమా అనేది నీచేతిలో ఉంది. పెంచుకొంటే బంధం, తుంచివేస్తే మోక్షం. బంధం కావాలంటే తలంపులను పెంచుకో. మోక్షం కావాలంటే తలంపులను తగ్గించుకో. రెండూ నీ చేతులలో ఉన్నాయి. ఏమి చేయాలో నీవే నిర్ణయించుకో. బలవంతం చేసే అలవాటు భగవాన్‌కు లేదు. ఆచరించమని కూడా చెప్పరు. విషయం వారికి అర్థమైతే ఎంతోకొంత ఆచరిస్తారు. అర్థమవ్వకపోతే ఆచరించమని చెప్పినా

ఆచరించరు. ఇతరులు నిన్ను బంధించటంలేదు, నీ తలంపులే నీకు సంకెళ్ళు. నీ తలంపులతో కలిసి బద్ధుడవు కావటమా లేక వాటిని విడిచి ముక్తిని పొందటమా అని నిర్ణయించుకొనే సామర్థ్యం నీలోనే ఉంది. బయట గురువు నీకు బోధిస్తాడు. నిర్ణయించుకొనే సామర్థ్యం నీలోపలే ఉంది. కొద్దిగా ఆలోచన చేయండి.

పూజగాని, జపంగాని, ధ్యానంగాని వీటి అన్నింటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే బాహ్యముఖంగా విజృంభిస్తున్న మనస్సుకు లోచూపు నేర్పి హృదయంలో నిలబెట్టటమే వీటి అన్నింటి ప్రయోజనం. లోపల ఉన్న వస్తువు అతి సూక్ష్మం. అది ఎంత సూక్ష్మమైనదో మన మనస్సు అంత సూక్ష్మం అయితేగాని అది అందదు. స్థూలమనస్సుకు ఆ వస్తువు అర్థం కాదు. మనస్సు నిర్మలం అయితేగాని, మనస్సుకు సమానస్థితి కలిగితే గాని అది హృదయాభిముఖంగా ప్రయాణం చేయలేదు. బాహ్యముఖంగా విజృంభిస్తున్న మనస్సును అంతర్ముఖపరచటానికి గురువు సహకరిస్తాడు. గురువు, ఆత్మ, దేవుడు అంటే వేరుకాదు. అంతా ఒక్కటే, ఉన్నది ఒక్కటే. అదే గురువుగా వస్తుంది. మా తండ్రిగారు చాలా మంచివారు, అందిరికి సహాయం చేస్తూ ఉంటారు. అటువంటి వారికి యాక్సిడెంట్‌లో మరణం రావటం ఏమిటి అని ఒకరు నాన్నగారిని అడిగారు. భగవంతుడు దేహాన్ని ఇచ్చినప్పడే అది ఎంతవరకు ఈ భూమి మీద తిరగాలి, ఆ దేహం ద్వారా ఏమి జరగాలి, ఆ దేహం ఎప్పడు మరణించాలి అన్నీ నిర్ణయించి పంపిస్తాడు. ఆ కాలం అయిపోయిన తరువాత ఆ దేహమును, జీవుడిని వేరు చేస్తాడు. దానికి ఏదో కారణం చూపిస్తాడు. అది ఏదో రోగం అవ్వవచ్చు, యాక్సిడెంట్ అవ్వవచ్చు, ఏదో ఒకటి. ఆ దేహముతో చేయవలసిన పని అయిపోయిన వెంటనే అదిపోతుంది. నీవు ఈ జన్మలో చేసుకొన్నది ఇప్పడే వచ్చేయదు. నువ్వు ఇక్కడ మంచి పనులు చేసినందువలన ఎక్కువకాలం జీవించాలి అని లేదు. వీటిగురించి దేవుని మీద ఉన్న విశ్వాసంలో చలనం అవసరం లేదు. మీ తండ్రి మంచిపనులు చేసారు అని చెప్పతున్నావు, ఆ మంచిని దేవుడు తీసుకొనిపోడు. తిరిగి ఆయనకే ఇచ్చేస్తాడు. మీ తండ్రి మీద ఉన్న మమకారం వలన నీకు అలా అనిపిస్తోంది. ఎంతోమంది ఇలా చనిపోవటం నీవు చూస్తున్నావు. అప్పడు నీకు ఈ ప్రశ్న రాలేదు. అంటే ఈ ప్రశ్న నీ వివేకంలోనుండి రావటం లేదు, మమకారంలోనుండి వస్తోంది. దేహంను ఇచ్చినప్పడే దానికి కాలాన్ని నిర్ణయిస్తాడు. ఆ టైము అయిన వెంటనే దేహమును, జీవుడిని వేరు చేస్తాడు. అది సూత్రం.

# సద్గురు నాన్నగారు

జన్మించారు సూర్యరాజమ్మ మొదట నోముల పంటగ
జీవించారు వారు ఎప్పడు బాగ పుస్తకాలు చదవగ
జతకట్టారు రాజకీయనేతలతో రాష్ట్రాన ఒక సోషలిస్టుగ
జవసత్వాలు ఈయగ చేసారు దేశసేవ ఒక రాజుగ

అందరు కన్నతండ్రిగ తలచి నాన్న అని పిలువగ
అందరు తన బిడ్డలగ తలచి ఆదరించి చూడగ
ఆనందము అందరికి పంచె జన్మ తరియించగ
ఆదరించి అందరిని తన వారిగ తలచి ప్రేమగ

నాన్న నోటి లాలిపాట తేటతెనుగు జోలపాట
అది వినిపించిన ప్రతిచోట సిరిమల్లెల పూదోట
సరిగమపదనిసలై రాగాలు పాడ ఆ లాలిపాట
నాన్న మనసెరిగి పాడారు సత్‌సంగులు అక్షరతోటగ
సద్గురు దర్శనం సత్‌సంగులకు ఆత్మానందం
సద్గురు వాక్కు సత్‌సంగులకు బ్రహ్మానందం
సద్గురు చూపు సత్‌సంగులకు పరమానందం
సద్గురు స్పర్శ సత్‌సంగులకు దైవానందం

నాన్నగారికి లేవు ఎటువంటి దృష్టాంతరాలు
నాన్న కనులు కురిపిస్తాయి కరుణరసాలు
నాన్న మాటలు వర్షిస్తాయి అమృతవర్షాలు
నాన్న ఎరుగరు ఎన్నడు ఎటువంటి ఆడంబరాలు

ఎవరేమడిగిన ఇస్తారు ఎందరికో దానధర్మాలు
ఎవరికైన పంచుతారు ప్రేమాప్యాయతలు
ఎవరైన వీరికి లేదు ఎన్నడు ఎప్పడు బేధభావాలు
ఎవరెన్నెన్నా వీరు చేస్తారు ఎప్పడు సేవలు

నాన్న కోరుతారు జగానందరి బాగోగులు
నాన్న ఆశిస్తారు అన్ని గ్రామాల అభివృద్ధులు
నాన్న చెప్పిస్తున్నారు చాలామందికి విద్యాబుద్ధులు
నాన్నగారిస్తున్నారు అందరికి మంచి ఆశీస్సులు

వీరెందరికో ఇచ్చారు అవసరమైన చేయూతలు
ఎందరికో వీరు చూపించారు ఉద్యోగ అవకాశాలు

వీరెప్పుడు ఇవ్వరు ఎవ్వరికి ఎన్నడు ఆదేశాలు
ఎవ్వరికైనా చూపిస్తారు మంచి మార్గదర్శకాలు

వినయ వివేకాలు పట్టుకొమ్మ మన సద్గురు నాన్న
విజ్ఞత విద్యల వితరణ బాగ ఇచ్చు సద్గురునాన్న
విద్య లేకున్న మనకి జ్ఞానమును ఇచ్చు సద్గురు నాన్న
వివేకము లేకున్న విజ్ఞానము ఇచ్చు సద్గురు నాన్న

బండలనైన బ్రహ్మాండంగ మలచు సద్గురు నాన్న
మసిబొగ్గైన మాణిక్యంగ మార్చును సద్గురు నాన్న
గుండెల నిండుగ ప్రేమను కురిపించును నాన్న
చింతలు బాపెడు గురువే దైవమన్న సద్గురు నాన్న

ఎంతవారలకైన విద్యకు గురుకటాక్షము అవసరమన్నారు
మతిహీనులు పలికిన పలుకులకు విలువ లేదన్నారు
అన్ని వాదములకు శాస్త్రవాసనలు అక్కరలేదన్నారు
నిన్ను ఎరిగినపుడు తన్నుతాను ఎరుగునన్నారు

భోగము సుఖము కష్టము రోగము సమమన్నారు నాన్న
ద్వేషము రాగము లోభము దోషములు వద్దన్నారు నాన్న
ప్రేమ కరుణ సేవ త్యాగములు బాగ నేర్వమన్నారు నాన్న
జ్ఞానము ధ్యానము సత్యము ఆనందము నేర్పెను నాన్న

కామక్రోధలోభమదమాత్సర్యములు తగవన్నారు నాన్న
పుట్టుట గిట్టుట అందరికి సహజమన్నారు నాన్న
వైరాగ్యానికి ఇంద్రియ నిగ్రహము అవసరమన్నారు నాన్న
పండితపామర ధన పేద గొప్పలు అసలు వలదన్నారు నాన్న

కష్టాలను ఇష్టాలను మరువమన్నారు సద్గురువు
కన్నీరు మున్నీరై విలపించవద్దన్నారు సద్గురువు
మంచి చెడులను బాగ ఎంచమన్నారు సద్గురువు
ప్రేమ కరుణలను బాగ పంచమన్నారు సద్గురువు

జిన్నూరనగ అల్లూరి సత్యం అనేవారు ఒకప్పుడు
జిన్నూరనగ నాన్నగారంటున్నారు ఇప్పుడు
జిన్నూరుకు గుర్తింపు ఉన్నది దేశానెపుడు
జిన్నూరుకు గౌరవాన్ని పెంచారు నాన్నగారిప్పుడు

**- బాబుశ్రీ, జిన్నూరు**

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# పరమగమ్యం

మనం అనుకొనేది ఏదీ నిజంకాదు. మనరోజులు సంతోషంగా వెళ్లిపోతున్నాయి అనుకొన్నా, ఆర్థికంగా బాగున్నాము అనుకొన్నా, మంచిపదవులలో ఉన్నాము అనుకొన్నా, అంతా స్వప్న సమానము. దేహం ఎంతనిజమో మన భౌతికాభివృద్ధి అంతే నిజం. దేహాత్మబుద్ధినుండి విడుదలపొంది, స్వరూప మోక్షశాంతిని పొందాలంటే, దానికి తగిన ప్రయత్నం ఇప్పడే, ఇక్కడే జరగాలి, అది ఎప్పడో, ఎక్కడో కాదు. హృదయంలో స్వరూపంగా ఉన్న పరమాత్మ స్పర్శ మనకు అందాలంటే అంతర్ దృష్టి కలగాలి. పరమాత్మ వైపుకు మనము ఒక్క అడుగువేస్తే, ఆయన మనవైపు తొమ్మిది అడుగులు వేస్తాడు. జీవితరూపంలో ఉన్న కాలాన్ని మనము సద్వినియోగం చేసుకోవాలి. దేహం పోషణకు ఇతరుల మీద ఆధారపడకుండా, తగిన పని చేసుకుంటూ, చిత్తశుద్ధి కొరకు సమాజరూపంలో ఉన్న పరమాత్మను సేవించుటకు కొంత కాలాన్ని కేటాయించి, తక్కిన కాలమునంతా ఆత్మజ్ఞాన సముపార్జనకు ఉపయోగించుకోవాలి. సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. మన నిత్య జీవితంలోనూ, అట్లే సాధనలోనూ, పవిత్రత, వివేకం, విచక్షణ, సూక్ష్మబుద్ధి అవసరం. వ్యక్తిభావన లేకుండా జీవిస్తూ, అందరి క్షేమాన్ని కోరుకోవాలి, భావదారిద్ర్యం కూడదు. అన్ని యోగాలకంటే గురుబోధను సక్రమంగా అర్థం చేసుకోవడమే గొప్ప యోగం. ఎదురుగా వ్యక్తం అయ్యే మనుష్యులనే అర్థం చేసుకోలేని వాళ్లం, అవ్యక్తమైన, దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతమైన పరమాత్మను ఎలా అర్థం చేసుకోగలం? అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా వాటితో తాదాత్మ్యం చెందకుండా, దేహప్రారబ్ధం మన బుద్ధి మీద పడకుండా చూచుకోవాలి. తాదాత్మ్య దోషం వల్ల ఆత్మజ్ఞానసముపార్జనకు అర్హత పోతుంది. మన తలంపు, మాట, చేతల ద్వారా ఎప్పటికప్పుడు నామబుద్ధి, రూపబుద్ధి నుండి విడుదలపొందాలి. సమస్తమును ఏకవస్తువుగా దర్శించుటయే జ్ఞానము. వాస్తవంగా తానెవరో? అనుభవైకవేద్యం అయితే అదే కడసారి జన్మ!

**ఓంతత్‌సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# “అనుగ్రహం ఇచ్చేది కాదు - అందుకొనేది”

జీవితంలో క్లిష్టమైన విషయం ఏమిటి? అంటే అందుకోవటానికి, సాధించటానికి, పొందటానికి పడే యాతన. ప్రశాంతతలోనే స్వస్వరూపాన్ని పొందుతాము. ముక్తికి దగ్గరత్రోవ చిత్తశుద్ధి. దానికి నిరవధికమైన ఆత్మ ఎఱుకకావాలి. పొరపాట్లు సహజం అనివార్యం. అది కర్మసిద్ధాంతంపై ఆధారపడి ఉంటుంది. కాని వాటిని సరిచేయు ప్రయత్నంలో సఫలమైతే ఈశ్వరస్వరూపాన్ని పొందుతాము. మన ప్రార్థన ఫలింపచేసుకొనే ప్రయత్నంలో నిజాయితీ ఉంటే నిజమైతే మనకు సహాయం లభిస్తుంది. సోమరితనంతో అంతా గురువే చేసిపెడతాడు అనుకొంటే అది వెఱ్ఱి ఊహ. ప్రతీ జననము బాధాకరమని తిరిగి జన్మకు రాకూడదనే పట్టుదలతో గురుదేవునితో “ఓ తండ్రీ నీవే సాకారదేవుడవు, నా తప్పులెంచకు. చేయి విడువకు. భక్తరక్ష కళానిధీ” అని ఆర్తితో ప్రార్థించాలి. అదే మహోత్కృష్టమైన ప్రార్థన. అది నిస్వార్థమైన ప్రేమతో వారి పాదాలయందు దృష్టినిలపటమే. అదే ప్రధాన అంశము. మనస్సును మనవశంలో చేసుకొనే ప్రయత్నం కంటే కఠినమైన యుద్ధం మఱియొకటి లేదు. కాబట్టి సాధన పైరీతిగా ఆయన కరణను ఆసరాగా తీసుకొని సాధన చెయ్యాలి. ఈ విషయంలో మనకు భక్తి, శ్రద్ధలను మనం సమకూర్చుకొనాలి. ఆ ప్రయత్నంలో ఓటమి ఎదురైనా మరల మరల ప్రయత్నించాలి. ఈ విషయంలో మన ప్రవర్తన మంచిదైతే ప్రగతికి అవకాశం ఉండితీరుతుంది. మన పవిత్రతతోనే మనం ఆయనకు దగ్గరౌతాము. భక్తి మనలోనే ఉంది కాని కామము, ధనాశ ఆభక్తిని కప్పిపుచ్చుచున్నది.. నిధిలో సుఖంలేదని వివేక, వైరాగ్యాలతో వాటిని తొలగించుకొంటే ఆ పరాభక్తిలో మునిగి ఉంటే అంతటా ఉన్నది నాలో ఉన్నది ఒక్కసత్యమే అనే అనుభవమౌతుంది అంటారు పెద్దలు. రమణభగవాన్ వద్దకు యు.జె.కె గారు వచ్చి “మీరు మహాత్ములు. మీ అనుగ్రహాన్ని కోరుతున్నాను ప్రసాదించండి” అంటే “ఇస్తాను పుచ్చుకోగలవా?” అన్నారు. దానిపై ఆయన ఇయ్యటానికి సిద్ధంగా ఉన్నారు అందుకొనే అర్హత సంపాదించి వస్తాను అనుకొన్నారు. ప్రతీజ్ఞాని అనుగ్రహ స్వరూపుడే కాని మనలో అరిషడ్వర్గాలు అనే దుర్వాసనలు ఉండగా పరమాత్మ ఎలా కూర్చుంటాడు. దానికై “ఒక్క అడుగు ముందుకు వేస్తే తొమ్మిది అడుగులు మనకోసం వస్తాడు. రామకృష్ణుడు “సాధనానుష్టానంలో మీరు పదహారోవంతు మీరు అనుష్టించ గలగాలి ఆ శ్రమ తప్పనిసరి” అనగా ఒకరు “స్పర్శమాత్రం చేతనే ఒకరిని పరిపూర్ణునిగా చేయగల శక్తి మీకు ఉంది ఎందుకు అలా చెయ్యకూడదు అంటే “నేను చేసినప్పుడు ఆతడు ఆ పరిపూర్ణత్వాన్ని నిలబెట్టుకోలేడు దాన్ని పొందటానికి పాటుపడాలి అందుకు సంసిద్ధుడై ఉండాలి” అన్నారు. శ్రీనాన్నగారు “పవిత్రుడివికా అనుగ్రహం రాకేం చేస్తుంది” అన్నారు. శ్రద్ధనుంచే భక్తి పుట్టుకొని వస్తుంది. ఆ గురుభక్తి వంట వండి ముద్దలు చేసి నోట్లో పెడతారు. కాని మింగే పని చెయ్యాలి. వాసనాజ్వరం తీవ్రంగా ఉంటే ఆ పరమాన్నం రుచించదు, మింగలేరు. కాని ఆయన కృపవల్ల కాలపరిపక్వమై ఆరోగ్యవంతులైతే మింగి శాశ్వతానందంలో ఉంటాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**